# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 07 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** విద్యార్థులకు క్రీడలు సహకరిస్తాయని ప్రధానంగా ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడానికి దోహదప డుతాయని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో అత్యధిక విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పా టు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వివిధ క్రీడలలో పాల్గొనడమే కాకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించా రు. సెప్టెంబర్ 29న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డా.బిఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన వివిధ ఎస్జీఎఫ్, జోనల్ ఛాంపియన్‌షిప్స్‌లో వివిధ విభాగాల్లో ఎంపికై రాష్ట్రస్థాయి పోటీ లకు అర్హత సాధించిన విద్యార్థులను అభినందించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## భూసేకరణ పనులు వేగవంతం చేయాలి



### రైతులు, నిర్వాసితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** భూసేకరణ పనులను వేగవంతం చేసి రైతులు,నిర్వాసి తులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలనిజగిత్యాల జిల్లా కలె క్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.జిల్లాలో కొనసాగుతున్న అన్ని భూసేకరణ ప్రాజె క్టులపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనుల పురోగతి,పరిహారం చెల్లింపులు, భూసేకర ణకు సంబంధించిన ఫైళ్ల స్థితిగతులను కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులన్నింటినీ వేగవంతం చేయా లని అధికారులను ఆదేశించారు. భూసేకరణ కారణంగా భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులకు చట్టబద్ధంగా అందాల్సిన పరిహారాన్ని త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను రోజువారీగా పరిశీలిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వాటిని పరిష్కరించాలని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ పనులు ఆటంకంగా మారకుండా నిర్దేశిత కాలవ్యవధిలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఆర్డీవోలు, ఇరిగేషన్ ఇంజనీర్లు, తహశీల్దార్లు, ల్యాండ్ అక్విజిషన్ (ఎల్‌ఏ) యూనిట్ అధికారులు తమ పరిధిలోని భూసేకరణ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. పెండింగ్ ఫైళ్లను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతో పాటు, రైతులు, నిర్వాసితులకు రావాల్సిన పరిహారం సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్,జగిత్యాల, కోరుట్ల,మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్,జీవాకర్ రెడ్డి, నరసింహా రావుతదితరులున్నారు.

## విద్యుత్ కోతలతో అన్నదాతలు విలవిల

**ప్రజాపక్షం/రామడుగు :** మండలంలోని అన్నదాతలు అప్రకటిత విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో విద్యుత్ కోతల మూలంగా ఎండిపోయిన వరి పంటలను ప్రజాపక్షం ప్రతినిధి పరిశీలించగా రైతు బసరవేణి గంగయ్య కరెంట్ కోతల మూలంగా తన రెండు ఎకరాలతోపాటు సమీప బంధువు యొక్క రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేయగా పూర్తిగా ఎండిపోయింది. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు కోతలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని రైతు గంగయ్య వాపోయాడు. తాను కౌలుకు తీసుకొని సాగు చేసిన పంట పూర్తిగా కరెంట్ కోతల మూలంగానే ఎండిపోయే దశకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈని ప్రజాపక్షం వివరణ కోరగా తాము ఎప్పటిలాగే విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏలాంటి కోతలు విధించడం లేదని స్పష్టం చేశారు. కానీ విద్యుత్ కోతల వల్లే పంట నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రెప్పపాటు కూడా విద్యుత్ కు కొరత ఉండేది కాదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ కోతలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చూసిన మాదిరిగా చూస్తున్నామని మరికొంత మంది రైతులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. ఏది ఏమైనా ఇప్పటికైనా విద్యుత్ కోతలు లేకుండా రైతులకు సరిపడా కరెంట్ సరఫరా చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.



## ఎఐటియుసి వైపే యువశక్తి

## ఒకేరోజు 465 మంది చేరిక



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని గనులపై యువ కార్మికులు ఎఐటియుసి వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. మంగళవారం ఎస్ఆర్‌పి 3 గనిలో 309 మంది, ఎస్ఆర్‌పి 1లో 156 మంది యువ కార్మికులు యూనియన్ కండువా కప్పుకున్నారు. సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మె లేకుండా సాధించిన 24 ప్రధాన డిమాండ్ల ఒప్పందం అమలయ్యే వరకు పోరాడతామన్నారు. సింగరేణి మనుగడకు కొత్త గనులు సాధించి ఉపాధి కల్పించడమే కాక, యువ కార్మికులకు యూనియన్‌లో నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రయ్య, సమ్మయ్య, మురళీ చౌదరి, దాడి రాజయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోవద్దు

### బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయాదేవి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు బీసీ సంక్షేమ శాఖ కమీషనర్ బాలమయాదేవి ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్‌తో కలిసి ఆమె సమీక్షా నిర్వహించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 87.68 శాతం పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు. ఫారం 6, 7, 8 కింద మొత్తం 65,716 ధరఖాస్తులు రాగా, 61,475 పరిష్కరించామని, మిగతావి పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదని ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంత ముఖ్యమో అర్హులైన ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడడం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు, సహకరిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. మిగిలి ఉన్న ధ్రువపత్రాల పరిశీలన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందు కోసం ఫారం6 ద్వారా ధరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కు ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఏఎస్‌డీడీ జాబితా మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం అదనపు కలెక్టర్‌తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. సిబ్బంది, ఫిర్యాదుల నమోదు, పరిష్కారాలపై ఆరా తీశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 121, 133లో రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు, అదనపు కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్‌వోలను ఆరా తీశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కెఎస్‌బి కుమారి, సిరిసిల్ల మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, ఏఈఆర్‌ఓలు కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

ప్రజాపక్షం/కొత్తపల్లి : కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కమీషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని డివిజన్ల ఏసీపీలు, సిఐలు, ఎస్సైలతో సమగ్ర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్లవారిగా నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కార వివరాలను క్షుణ్ణంగా సమీక్షించారు. రెండేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉండి నిందితులు పట్టుబడని కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచాలని ఆదేశించారు. కేసు స్వభావాన్ని బట్టి నిర్దేశిత చట్టబద్ధమైన గడువు 60 లేదా 90 రోజుల్లోగా సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమీషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన ప్రివెంటివ్ డిటెన్షన్ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్ కుమార్, మాధవి తదితర సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట



ప్రజాపక్షం/రామగిరి : సెంటినరీ కాలనీ వాసుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సుమారు 07 కోట్ల తో, పోతన కాలనీ ఫిల్టర్ బెడ్ నుండి సెంటినరీ కాలనీ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 8.2 కిలోమీటర్ల నూతన తాగునీటి పైపు లైన్ పనులకు మంగళవారం స్థానిక సోలార్ మెయిన్ కంట్రోల్ కార్యాలయ సమీపంలో రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పైప్ లైన్ వేసి చాలా కాలమైనందున తరచూ మరమ్మత్తులు రావడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, అందుచేత నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని,ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్వోటుజియం యం. రామ్మోహన్, సివిల్ డిజియం ఎస్.రవి కుమార్, పాల్గొన్నారు.

## రామడుగులో హిందూ శంఖారావం విజయవంతం

ప్రజాపక్షం/రామడుగు: మండల కేంద్రంలో హిందూ శంఖారావం జిల్లా అధ్యక్షులు వన్నారం అక్షయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైంది. హిందూ శంఖారావంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన కొండగట్టు గిరి ప్రదక్షిణ స్థాపకులు సురేష్ ఆత్మారం మహారాజ్ పాలాభిషేకం చేసి పూలమాల సమర్పించి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైశ్య భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి హనుమాన్ ఫల పంచామృతాలతో అభిషేకం చేసి మాట్లాడారు. రాముడు ఏలి అడిగేసిన నేలని ఇక్కడ కాషాయ జెండా ఎగరవేస్తామని కాషాయ జెండా ఎగురవేసే వరకు విశ్రమించబోమని హిందువులకు ప్రతి ఒక్కరికి చైతన్యం రావాలని అన్నారు. ఈ గడ్డపై కాషాయం ఎగరాలంటే కులాలకతీతంగా జీవించాలని విడిపోతే పడిపోతామని కలిసి ఉంటేనే ఈ గడ్డపై రామరాజ్యం వస్తుందని అన్నారు. ఆంజనేయ స్వామి ప్రత్యక్షంగా రాముడు అడిగేసిన నేలపై కాషాయ జెండా ఎగిరేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల ప్రభాకర్, మోడీ రవీందర్, పెరుక శ్రావణ్, శివాజీ సేన రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్, మహిళా వక్త గుల్లపల్లి త్రివేణి, మామిడిపల్లి కృష్ణచైతన్య, కలిగేటి ఎల్లయ్య, కోరుటపల్లి గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి, పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీపై బిజెపి నేతల పరిశీలన



ప్రజాపక్షం/గంగాధర : భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా పరిపాలనలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అలాగే ఆయన జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగాధర మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గర్శకుర్తి, తాడిజెర్రి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం పంపిణీ పిల్లలు, గర్భిణీలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం ఇతర సౌకర్యాలపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క ముఖ్య అతిథిగా హాజరై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వర్కర్లతో మాట్లాడి కేంద్రం నిర్వహణ, పిల్లలకు అందుతున్న సేవలపై వివరాలు సేకరించారు. అదేవిధంగా కేంద్రానికి చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలతో ముఖాముఖిగా మాట్లాడి వారికి అందుతున్న పౌష్టికాహారం ఇతర ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శోభక్క మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు రకాల పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ ముట్టడించిన బిజెపి నాయకులు



ప్రజాపక్షం/గన్నేరువరం: రైతులకు నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో మంగళవారం బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు బిజెపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులు సబ్ స్టేషన్ ఆవరణలోకి చొచ్చుకుపోయి సబ్ స్టేషన్ ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అకస్మాత్తుగా విధిస్తున్న విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో నీరు అందక పొట్ట దశలో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు సొల్లు అజయ్ వర్మ, కరివేద మహిపాల్ రెడ్డి, విలాసారం రాయమల్లు, బొమ్మిడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, మచ్చ సాయికృష్ణ, అనంతరెడ్డి, చెక్కిళ్ల చంద్రయ్య, బండి తిరుపతి, అటికం రామచంద్రం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ గా వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్‌గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనే శ్రీనివాస్, యూత్ కోఆర్డినేటర్‌గా మొగలోజు రాకేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కోల అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, చిదుర సురేశ్, పి.శ్రీహరి రెడ్డి, రాగి శ్రీనివాస్, సాయిని నరేందర్, హనుమండ్ల రాజిరెడ్డి, కాన్పర్తి మనోహర్ రావు, ఎలుగందుల మునీందర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి,జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం లను మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, డిఆర్వోలను కలిసి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ తమ ఎన్నికల్లో ఉద్యోగుల జేఏసీ నాయకులు కీలక పాత్ర పోశించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ రెడ్ క్రాస్ ఆశయాలకు అనుగుణంగా మానవతా సేవలను విస్తృతం చేస్తామని అన్నారు. రక్తదాన శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు, ఆరోగ్యసేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్ల అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్ అభినందనలు తెలిపారు.

## వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



ప్రజాపక్షం/గంగాధర : జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గంకిడి సంధ్య రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఎన్.బాపురాజు మాట్లాడుతూ వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో అవసరమని వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అడవులను, జంతువులను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం అందించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండి ఆసిఫ్, పంచాయతీ కార్యదర్శి జయకర్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ బి.అనంతరామ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేగురుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడుగా నందికొండ రారెడ్డి

ప్రజాపక్షం/మానకొండూర్ : మండలంలోని వేగురుపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నందికొండ రారెడ్డి నియమితులయ్యారు. మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలమేరకు మంగళవారం రామ్‌రెడ్డిని నియమిస్తూ మండల కమిటీ అధ్యక్షుడు దేవ శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి గ్రామ కమిటీ అధ్యక్షునిగా నియమించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాణకు తన నియామకానికి సహకరించిన గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.రారెడ్డి నియామకం పట్ల గ్రామ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## రామగుండం రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

ప్రజాపక్షం/రామగుండం : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా రామగుండం రైల్వే స్టేషన్‌లో మంగళవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రామగుండం సబ్ ఇన్స్పెక్టర్ జి.హరిశేఖర్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ సహాయంతో రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాళ్లు, ప్రయాణికుల లగేజీలను డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు.ముఖ్యంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు, వస్తువుల వివరాలను ఆరా తీశారు. రైల్వే మార్గం ద్వారా నిషేధిత వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఆదర్శ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ఆదర్శ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలలో భాగం గా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టల్ సౌకర్యాలు, విద్యుత్ వ్యవస్థ, పాఠశాల పరిసరాలు, క్రీడా మైదానం తదితర అంశాలను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాల, బాలికల హాస్టల్‌లో అవసరమైన మరమ్మత పనులను గుర్తించి వెంటనే చేపట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డి బబ్లీ కౌర్, సంబంధిత అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## జగ్గాసాగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగ్గాసాగర్ గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ (జగన్) కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామ శివారులో తెగిపోయిన మాటుకాలువకు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడి నివారించాలని,కొండస్వామి ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే గ్రామంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు గ్రామపంచాయతీ భవనంపై కమిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## పోషణ మాసం కార్యక్రమం



**ప్రజాపక్షం/ధర్మపురి :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ్ మాసం కార్యక్రమాన్ని ధర్మపురి ప్రాజెక్టు పరిధిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరై మాట్లాడుతూ, పోషకాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.కుటుంబంలో విద్యావంతురాలు, ఆరోగ్యవంతమైన తల్లి ఉంటే కుటుంబం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ పోషణ్ మాసం ప్రాముఖ్యతను వివరించారు. ధర్మపురి ప్రాజెక్టు సీడీపీఓ వాణిశ్రీ మాట్లాడుతూ ప్రతి కుటుంబం సమతుల్య ఆహారం తీసుకుని పోషకాహార లోపం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.ఏసీడీపీఓ మౌనిక మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సంగి ఆనంద్,ఒజ్జల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేష్, ముదుసుల ప్రశాంత్‌తో పాటు వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయానికి భక్తుల సందడి..

రూ.16,878 ఆదాయం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.11,150, హుండీ లెక్కింపులో రూ.5,728 కలిపి మొత్తం రూ.16,878 ఆదాయం సమకూరింది. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వహణ చేపట్టినట్లు ఈఓ సంగేము సురేందర్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మెట్‌పల్లి పోలీసులు పర్యవేక్షించారు.

## సైబర్ క్రైమ్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** సైబర్ నేరాలపై అందే ప్రతి ఫిర్యాదుకు తక్షణమే స్పందించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల పురోగతిపై పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న సైబర్ క్రైమ్ కేసులు,దర్యాప్తు పురోగతి, నిందితుల గుర్తింపు, అరెస్టులు, బాధితులకు అందుతున్న సహాయ చర్యలపై ఎస్పీ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ కేసులను సీఐలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.అక్టోబర్ 2026ను జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసంగా పాటిస్తున్న సందర్భంగా, సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. Pause. Think.Verify."అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని,అలాగే cybercrime.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సి.ఐ లు రామ్ నరసింహారెడ్డి, సుధాకర్, కరుణాకర్, సురేష్ బాబు, లక్ష్మీ నారాయణ,సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, సైబర్ క్రైమ్ ఎస్.ఐలు కృష్ణ, దినేష్ మరియు సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గాయత్రీ విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** గోదావరిఖని లో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ సెలక్షన్లో అత్యంత ప్రతిభ కనబరిచిన పిల్లలను ఎంపిక చేయడం జరిగింది.అందులో గాయత్రి విద్యానికేతన్, పెద్దపల్లి విద్యార్థులు 8 మంది ఎంపిక కావడం జరిగింది.ఎంపికైన విద్యార్థులను గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మరియు గాయత్రీ విద్యానికేతన్ కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలలో కూడా రాణించాలని వారి భవిష్యత్తులో ఇలాంటి క్రీడలు మరెన్నో ఆడి రాష్ట్రానికి అలాగే దేశానికి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి చెప్పడం జరిగింది . ఎంపికైన విద్యార్థులు ఈనెల అక్టోబర్ 16వ తేదీన హన్మకొండ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్,కరస్పాండెంట్ రజనీ దేవి అలాగే ప్రిన్సిపాల్ విజేందర్ పి ఈ టి అజయ్,మహేందర్ లు పాల్గొన్నారు.

## ఓడేడు మానేరు వాగుపై తాత్కాలిక రోడ్డు పనులు పూర్తి

భూపాలపల్లి జిల్లాల మధ్య పునఃప్రారంభమైన రాకపోకలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే ముత్తారం మండలం ఓడేడు గ్రామ సమీపంలోని మానేరు వాగుపై తాత్కాలిక మట్టి రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో రెండు జిల్లాల మధ్య నిలిచిపోయిన రవాణా సౌకర్యం మళ్లీ యధావిధిగా కొనసాగుతోంది.ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మానేరు వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో, ఇక్కడి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీనివల్ల రెండు జిల్లాల మధ్య ప్రయాణం పూర్తిగా నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద ఉధృతి తగ్గడం, వర్షాలు శాంతించడంతో నేషనల్ హైవే కాంట్రాక్టర్ తక్షణమే స్పందించారు.తెగిపోయిన రోడ్డు ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన మట్టిని పోసి,రోడ్డును పునరుద్ధరించారు.ఈ తాత్కాలిక రోడ్డు అందుబాటులోకి రావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు చిట్యాల, వరంగల్, జమ్మికుంట ప్రాంతాలకు వెళ్లే రైతులకు, వాహనదారులకు ప్రయాణ దూరం భారీగా తగ్గింది. ఇరు జిల్లాల సరిహద్దు ప్రజలు,ప్రయాణికులు రోడ్డు పునరుద్ధరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దసరా నాటికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయాలి



ఆర్అండ్‌బి శాఖ అధికారులకు రామగుండం మేయర్ మహంకాళి స్వామి ఆదేశాలు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** దసరా పండుగ నాటికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునేలా మౌలిక వసతుల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆర్అండ్‌బి శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రామగుండం నగరంలోని 2వ డివిజన్ జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్లకు మౌలిక వసతులు కల్పించేందుకు ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా పైప్‌లైన్ పనుల పురోగతిని పరిశీలించారు. పనుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచి,పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.దసరా నాటికి గృహప్రవేశాలకు అనుకూలంగా పనులన్నీ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం రామగుండం 25వ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించారు.ఆయా పనుల పురోగతిని అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంగళ బాపు, దాసరి సాంబమూర్తి, బాలసాని తిరుపతి, డేవిడ్ రాజు, ఆర్అండ్‌బీ శాఖ డీఈఈ రషీద్, ఏఈ జావీద్,డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, 25వ డివిజన్ కార్పొరేటర్ సిరిశెట్టి సతీష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట శివారులోని టాటా స్ట్రైవ్ శిక్షణ కేంద్రాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సందర్శించారు. యువతకు అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.విద్యతో పాటు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే అన్నారు.బ్యాంకింగ్, ఫైనాన్స్, సోలార్ రంగాల్లో అందిస్తున్న శిక్షణను అర్హులైన యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు.

## రైతులకు డ్రిప్ సాగు విధానాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గుండేటి తిరుపతి రెడ్డి తోటలో మంగళవారం రైతులకు డ్రిప్ (బిందు సేద్యం) వినియోగం, దానిని శుభ్రం చేసుకునే విధానాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించడానికి డ్రిప్ విధానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. డ్రిప్ లాటరల్స్, డ్రిప్పర్లలో లవణాలు, చెత్త పేరుకుపోకుండా క్లోరినేషన్, యాసిడ్ ట్రీట్మెంట్ ద్వారా ఎలా శుభ్రం చేసుకోవాలో రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఈ.ఓ వంశీకృష్ణ, కుమార్ కంపెనీ ప్రతినిధి సురేష్,తిరుపతి ,ఆదర్శ్ ,తోట యజమాని తిరుపతి, అలాగే గ్రామానికి చెందిన ప్రముఖ రైతులు నేరెళ్ల రాజిరెడ్డి, స్వామి రెడ్డి,గడ్డం గంగారెడ్డి, పర్శ మల్లయ్య,నల్ల లక్ష్మి రెడ్డి,గడ్డం గంగరాజాం,రాజగౌడ్,ఇతర రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ధర్మపురి :** నాబార్డు ఆర్థిక సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జగిత్యాల కోఆర్డినేటర్ డా. తిరుపతి తెలిపారు. జైన రైతు వేదికలో పిఎసిఎస్ సభ్యు లు, రైతులకు వరి విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జైన పిఎసిఎస్ పరిధిలో ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ధృవీకరించబడిన మూ ల విత్తనాన్ని ఎంపిక చేసుకుని, విత్తన స్వచ్ఛత, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సీనియర్ శాస్త్రవేత్త డా. శ్రీనివాస్ సూచించారు. పంటలో పురుగు, తెగుళ్ల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డా. స్వాతి తెలిపారు.మండల వ్యవసాయ అధికారి రాజకుమార్ మాట్లాడుతూ విత్తన ధృవీకరణ సంస్థ నిబంధనలు పా టించాలని, నాణ్యమైన విత్తనోత్పత్తి ద్వారా రైతులకు అదనపు ఆదా యం లభిస్తుందని పేర్కొన్నారు. రానున్న యాసంగిలో వరికి బదులు గా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితునికి బిఆర్ఎస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/గంగాధరః** గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కరబూజ తిరుపతిగౌడ్ కుమారుడు కరబూజ ప్రణయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ప్రణయ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్, వేముల దామోదర్, శ్రీమల్ల మోఘరాజు, రామిడి సురేందర్, గంగాధర సంపత్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మరియు నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు మంత్రులను కలిసి ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ... త్వరలోనే నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అర్జుమంద్ అలీ,మాజీ జెడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు పట్టణ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర ఎంతో కీలకమైనదని ఫారెస్ట్ డివిజనల్ అధికారి టి. భార్గవ్ కుమార్ స్పష్టం చేశారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు అటవీ, వన్యప్రాణుల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్‌డీవో భార్గవ్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అడవుల సంరక్షణకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓలు హేమలత, బాబు పటేకర్, వినయ్ కుమార్, ఎఫ్‌బిఒలు బానయ్య, అనిమల్ ట్రాకర్ శ్యామ్ రావ్, కళాశాల ప్రిన్సిపాల్, పాల్గొన్నారు.

## రైతులకు నిరంతర నాణ్యమైన విద్యుత్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను (డిటిఆర్) వెంటనే మార్చి సరఫరాను పునరుద్ధరిస్తున్నామని టిజిఎన్‌పిడిసిఎల్ డిఎం బాబురావు తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్ రూరల్ పరిధిలోని గన్నారంలో విఫలమైన 25 కెవిఎ డిటిఆర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. సాగు సీజన్ దృష్ట్యా అంతరాయాలు లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని, మరమ్మతులకు గురైన వాటిని ఆలస్యం లేకుండా బాగు చేసి అందుబాటులోకి తేవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ రాంప్రసాద్, డిఇ వీరేశం పాల్గొన్నారు.

## ఎస్పి జానకి షర్మిలకు కాంగ్రెస్ నాయకుల సన్మానం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో ఇటీవల జరిగిన గణేష్ నిమజ్జన వేడుకలను శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.నిర్మల్‌తో పాటు ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. పండుగ వాతావరణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు తీసుకున్న సమర్థవంతమైన చర్యలను పలువురు అభినందించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నూతన పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎస్పీ జానకి షర్మిలను కలిసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని అత్యంత ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసు అధికారులు మరియు సిబ్బంది రాత్రింబవళ్లు అందించిన సేవలను కాంగ్రెస్ నాయకులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లు,జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు మరియు ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యుత్‌ను సురక్షితంగా వినియోగిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం టీజీఎన్‌పీడీసీఎల్ డి.ఈ టెక్నికల్ వివరించారు.విద్యుత్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.నిర్మల్ రూరల్ సెక్షన్ పరిధిలోని తాంశా గ్రామ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులకు విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణ చర్యలు,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు గ్రామస్థులకు వివరించారు.ఇళ్లలో విద్యుత్ పరికరాలను ఉపయోగించే సమయంలో నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు ఉపయోగించాలని, ఓవర్‌లోడ్ అయ్యే విధంగా ఒకే సాకెట్‌కు ఎక్కువ పరికరాలను అనుసంధానం చేయరాదని సూచించారు. తడి చేతులతో స్విచ్‌లు, విద్యుత్ పరికరాలను తాకకూడదని, పిల్లలను విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలని తెలిపారు. వర్షాలు, గాలులు, పిడుగుల సమయంలో విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని తెలిపారు.వ్యవసాయ పనుల సమయంలో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బిజెపి ఆధ్వర్యంలో అంగన్ మిలాన్ కార్యక్రమం



**ప్రజాపక్షం/మానకొండూర్ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా మానకొండూర్ మండలంలో అంగన్ మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని మానకొండూర్, గట్టుదుద్దెనపల్లి, వేగురుపల్లి, దేవంపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మోర్చా అధ్యక్షురాలు గుర్రాల నిర్మలా రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఆవుదారి విజయ, బిజెపి మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం చిన్నారులకు, గర్భిణీలకు సక్రమంగా అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, బాగోగులపై సిబ్బందితో మాట్లాడి కేంద్రాలను పరిశీలించారు. తల్లిదండ్రులు, గర్భిణీలతో ముఖాముఖిగా మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల వారి పోషణ పట్ల మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాషబోయిన ప్రదీప్ యాదవ్, ఉపాధ్యక్షులు మర్రి ఆంజనేయులు, నాయకులు సోన్నాకుల శ్రీనివాస్, మార్కొండ రమేశ్ పటేల్, నందగిరి బలరాం, కార్యవర్గ సభ్యులు యాళ్ల రాజగోపాల్ రెడ్డి, గాడిచర్ల భూమయ్య, ఆరెపల్లి సునంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్‌కాస్ట్‌తో కాసిపేట రహదారికి ముప్పు

**ప్రజాపక్షం/కాసిపేట:** కళ్యాణి ఖని ఓపెన్‌కాస్ట్ గని విస్తరణతో కాసిపేట మండల గ్రామాల ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని సామాజిక ప్రజా స్పందన వేదిక కన్వీనర్ శీలోజు మురళి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్య వైఖరితో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది మండల భవిష్యత్తుకు సంబంధించిన తీవ్ర ప్రాంతీయ సమస్య అని, రాజకీయ పార్టీలు ఓట్ల ప్రయోజనాలు పక్కనబెట్టి ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచించాలని కోరారు. మండల పరిరక్షణ కోసం పార్టీలు, ప్రజాసంఘాలతో తక్షణమే 'అఖిలపక్ష కమిటీ' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రహదారి, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ నెల 11న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించే సమావేశానికి ప్రజలు, యువకులు, నాయకులు పార్టీలకు అతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## సింగరేణి ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష



**ప్రజాపక్షం/మందమర్రి:** మందమర్రి ఏరియాలో 2026–27, 2027–28 ఆర్థిక సంవత్సరాల బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు లక్ష్యాల సాధనపై ఆన్యువల్ ప్లాన్, టార్గెట్ కమిటీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. స్థానిక జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిఎం ఎన్. రాధాకృష్ణ సమక్షంలో కార్పొరేట్ కమిటీ ప్రతినిధులతో సమావేశం జరిగింది. గనుల్లో ప్రగతి, ఓపెన్‌కాస్ట్ పనులు, భారీ యంత్రాల సామర్థ్యంపై సమీక్షిస్తూ, భూసేకరణ, పునరావాసం (ఆర్ అండ్ ఆర్), పర్యావరణ, అటవీ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కార్పొరేట్ సహకారం ఉంటుందని కమిటీ స్పష్టం చేసింది. కార్యక్రమంలో కార్పొరేట్ జీఎంలు దేవేందర్, నరసింహారావు, డిజిఎం గాబ్రియేల్‌రాజు, గని మేనేజర్ ప్రసాద్, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

## అట్య-పట్య రాష్ట్ర క్రీడలకు ఎంపికైన సాన్వీ విద్యార్థులు




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** జగిత్యాల జిల్లా కోరుట్ల మినీ స్టేడియంలో ఈనెల 10,11, 12 తేదీలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర, బాలికలు అటియా పటియా క్రీడలకు కరీంనగర్ సాన్వీ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ తెలిపారు. బాలికల విభాగం నుంచి డి.నవనీత, కే.హారిణి, కె.శ్రీవర్షిణి, పి.శ్రావిక, ఆర్.రుచితలు, బాలుర విభాగం నుంచి పి.అభిరామ్ రావు, సాత్విక్, విజయ్ కుమార్, శివతేజ, రోహిత్, నిత్యసాయిలు కరీంనగర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్, కోచ్‌లు శ్రీనివాస్, లక్ష్మణ్, నవ్య, స్వర్ణ అనీష్, ప్రిన్సిపల్ రత్నాకర్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

## మహిళపై లైంగిక వేధింపులు... నిందితుడి కోర్టు రిమాండ్

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** వీర్నపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళను లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న భూక్య నవీన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి, చట్టపరమైన ప్రక్రియను పూర్తిచేసిన అనంతరం నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించింది. మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు లేదా ఇతర నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. మహిళలు తమకు ఎదురయ్యే వేధింపులు లేదా నేరాలకు సంబంధించి ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక ఎస్ఐ వేముల లక్ష్మణ్ సూచించారు

## మంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే లద్నాపూర్ భూ నిర్వాసితులకు న్యాయం

**ప్రజాపక్ష/రామగిరి :** రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ నిర్వాసితుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామానికి చెందిన 283 కుటుంబాలకు పునరావాస పరిహారం (ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ) మంజూరైంది. మంత్రి కృషికి కృతజ్ఞతగా లద్నాపూర్ లోని శ్రీ గోదారంగనాయక స్వామి దేవాలయం వద్ద ఆయన చిత్రపటానికి గ్రామస్తులు,కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం చేశారు.గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు అధ్యక్షతన,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు తొగరి చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై పాలాభిషేకంచేశారుఈ సందర్భంగా తొట్ల.తిరుపతి యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. లద్నాపూర్ ప్రజల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉందన్నారు ఈ కార్యక్రమం లోరామగిరి కాంగ్రెస్ పార్టీ ,సభ్యులు,మహిళలు,పాల్గొన్నారు.

## జైపూర్‌లో దొంగ అరెస్ట్

**ప్రజాపక్షం/జైపూర్:** ఇళ్ల తాళాలు పగులగొట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న సబ్బాని లక్ష్మీ నారాయణ అలియాస్ చింటూ (27)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ భూమేష్ తెలిపారు. నిందితుడు తన స్నేహితుడు మహ్మద్ మగ్దూమ్‌తో కలిసి సెప్టెంబర్ 28న ఇందారంలో రెండు ఇళ్లలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. అంతేకాకుండా బెల్లంపల్లి, గాంధీనగర్, ఇందారంలో మరో మూడు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడి నుంచి 2 తులాల వెండి పట్టీలు, రూ.3,000 నగదు స్వాధీనం చేసుకున్నామని, గతంలోనే సహచరుడి నుంచి బంగారు ఆభరణాలు రికవరీ చేశామని పేర్కొన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు ఉంచవద్దని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్



**ప్రజా పక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని పొట్ పెల్లి బి గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలు చేరువ చేసేలా నూతన రేషన్ కార్డుల పంపిణీ గ్రామ సర్పంచ్ బుర్రోల్ల చరణ్ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా కొత్త కార్డులను అందజేసి అభినందించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందడంలో రేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.నూతన కార్డుల ద్వారా ఇకపై సకాలంలో నిత్యావసర సరుకులు అందుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంచాయతీ సెక్రటరీ రేషన్ డీలర్,గ్రామ పెద్దలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## లయన్స్ భవనంలో కంటి శిబిరం




**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ జ్ఞానసాగర్‌రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, కిసాన్‌నగర్ సర్పంచ్ రామరాజుగౌడ్, లయన్స్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, కార్యదర్శి కనకయ్య పాల్గొన్నారు.

## జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/మాక్లూర్ :** కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఇండియా కూటమి పిలుపు, జిల్లా డీసీసీ అధ్యక్షులు నాగేష్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ సూచనల మేరకు మాక్లూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దయాకర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సీఈసీ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేసి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు మెమోరాండం అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఇంజనీర్ కోల అన్నారెడ్డి ఘన విజయం



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఇటీవల జరిగిన జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించిన ఇంజనీర్ కోల అన్నారెడ్డిని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137ఏ, కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా.ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ సభ్యులు, లైఫ్ మెంబర్లకు రక్తం అవసరమైనప్పుడు కోల అన్నారెడ్డిని జిల్లా కార్యవర్గాన్ని సంప్రదించి రక్త సేవలను పొందవచ్చని తెలిపారు. అలయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలతో కలిసి అలయన్స్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. వాసుదేవ హాస్పిటల్‌లో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా.ఎలగందుల శ్రీనివాస్, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, విడిజి2 సాగర్ రెడ్డి, శ్రవణ్, మహేంద్ర రెడ్డి, జిల్లా పిఆర్ఓ పుల్లాల శ్యామ్, ఈద కుమారస్వామి, గాలిపల్లి నాగేశ్వర్, చర్మల వెంకటేశ్వర్లు, ప్రసాద్ పండగ నాగరాజు, ఆనంద్‌కుమార్, వెంకన్న, డా.అశోక్, డా.రామకృష్ణ, డా.కిరణ్, డా.శశికాంత్, డా.పురుషోత్తం, వివిధ అలయన్స్ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాన్ని పర్యటించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం కరత్వాడ గ్రామాన్ని మంగళవారం తహసిల్దార్ సుభాష్ చంద్ర పర్యటించారు.గ్రామం లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగితెలుసుకున్నారు.అలాగే ముంపునకు గురైన వారికీ ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను అక్కడ కట్టుకొని ఉంటున్నా గుడిసెలను (ఇండ్లను) పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరిని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి నిరుపేదలందరికి ఆదుకోవాలని తహసిల్దార్ని కోరారు. తహసిల్దార్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలియచేసారు.ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగోరావ్,గ్రామపాలన అధికారి మందుల కృష్ణ,గ్రామప్రజలు ఉన్నారు.

## నిర్మల్‌లో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ (TGNPDCL) వేగవంతంగా చర్యలు చేపడుతోందని విద్యుత్ శాఖ నోడల్ అధికారి, జీఎం గోపికృష్ణ తెలిపారు. నిర్మల్ సర్కిల్ పరిధిలోని అక్కాపూర్ 220/132 కేవీ సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేస్తున్న 160 MVA పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (PTR) సివిల్ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలించారు.ఈ సందర్భంగా జీఎం గోపికృష్ణ మాట్లాడుతూ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన పునాది మరియు ఇతర సివిల్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని,అనంతరం తదుపరి దశలో బే (Bay) పనులను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం ద్వారా సబ్‌స్టేషన్ పరిధిలోని లోడ్లను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే వ్యవసాయ సీజన్‌తో పాటు వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మరియు ఫీడర్ల సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి హోరెత్తుతున్న ప్రచారం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టీసి) గుర్తింపు సంఘం ఎన్నికల వేడి నిర్మల్‌లో రాజుకుంది. ఈ నెల 9న జరిగే పోలింగ్‌ను పురస్కరించుకుని నిర్మల్ డిపో ఆవరణలో మంగళవారం ఆర్టీసీ ఐక్య కూటమి (టిఎమ్‌యు, ఈయు, ఎన్‌ఎమ్‌యు) ఆధ్వర్యంలో బ్రహ్మాండమైన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో,టి.యమ్.యు మరియు ఈయు అధ్యక్ష కార్యదర్శులు K.లక్ష్మణ్, P.నారాయణ,K. రాకేష్,K.K. దాస్‌లు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పడిన ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఓటింగ్ విధానాన్ని వివరిస్తూ... రీజినల్ స్థాయిలో క్లాస్6 కోసం అందించే వైట్ కలర్ బ్యాలెట్ పై ఉన్న నిచ్చెన గుర్తుకు (టిఎమ్‌యు), అలాగే రాష్ట్ర స్థాయిలో క్లాస్ 3 (ఇయు) కోసం అందించే ఎల్లో కలర్ బ్యాలెట్ పై ఉన్న బస్సు గుర్తుకు ఓటు వేసి ఐక్య కూటమికి అఖండ విజయం అందించాలని పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా ఆర్టీసీలో జరుగుతున్న సంక్షేమ నిబంధనల ఉల్లంఘనలు,మేనేజ్‌మెంట్ అజాగ్రత్తలు, ప్రయాణికులకు ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులు మరియు ఇతర కీలకమైన సమస్యలపై ఐక్య కూటమి స్పష్టమైన ప్రణాళికతో దృష్టి సారించిందని నాయకులు ఉద్ఘాటించారు. ఈదురు వెంకన్న,థామస్ రెడ్డిల సమర్థవంతమైన నాయకత్వంలో (టిఎమ్‌యు, ఇయు, ఎన్‌ఎమ్‌యు) కూటమి విజయం తథ్యమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాడే శక్తి ఒక్క ఐక్య కూటమికే ఉందన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో డిపో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని మద్దతు తెలిపారు.

## బోథ్ ప్రాథమిక సహకార సంఘంలో రైతుల నిరసన



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని వివిధ గ్రామాల రైతులు గన్నే బ్యాగుల డబ్బులు కావాలని నిరసన వ్యక్తం చేశారు. గత మొక్కజొన్న,జొన్న పంటల కొనుగోలు సందర్భంగా గన్ని బ్యాగుల కొరత ఉండటంతో రైతులు తామే స్వయంగా గన్ని బ్యాగులను కొనుక్కున్నారు. రైతులు కొన్న గన్ని బ్యాగులకు తామే చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో రైతులే ప్రభుత్వ మాటకు కట్టుబడి ఉన్నారు. ఇప్పటికీ గన్ని బ్యాగుల డబ్బులు రైతుల అకౌంట్లో పడకపోవడంతో రైతులు పిఎసిఎస్ మంగళవారం ముట్టడించారు.గన్ని బ్యాగుల డబ్బులు వెంటనే అకౌంట్ లో వేయాలని వినతి పత్రం సి.ఈ. ఓ.కు అందించారు.

## నిర్మల్ స్వప్న హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్‌లోని మన స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఒక మహిళ ప్రాణాలను కాపాడారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన ఒక మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ ఇటీవల స్వప్న హాస్పిటల్‌కు వచ్చింది. ఆమెను పరిశీలించిన ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు (ఎం.ఎస్. సర్జన్) డాక్టర్ శశికాంత్, యూరోలాజిస్ట్ డాక్టర్ అశోక్ వెంటనే CTKUB స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ నివేదికల ఆధారంగా ఆ మహిళ మూత్రసంచి (యూరినరీ బ్లాడర్)లో అనేక రాళ్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని యూరోలాజిస్ట్ డాక్టర్ అశోక్ నేతృత్వంలోని వైద్య బృందం వెంటనే శస్త్రచికిత్స చేపట్టింది. అత్యంత జాగ్రత్తగా ఆపరేషన్ చేసి మహిళ మూత్రసంచి నుండి ఏకంగా 119 రాళ్లను విజయవంతంగా తొలగించారు.ఎంతో సంక్లిష్టమైన ఈ అరుదైన శస్త్రచికిత్సను పేషెంట్‌కు రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా పూర్తి చేయడం విశేషం. విజయవంతంగా ఆపరేషన్ చేసి తనకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ శశికాంత్,డాక్టర్ అశోక్ మరియు హాస్పిటల్ యాజమాన్యానికి బాధితురాలు,ఆమె కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రోప్‌వే కోసం ఖిల్లా రామాలయ పరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలోనే చారిత్రక కట్టడమైన ఇందూరు ఖిల్లా రామాలయ అభివృద్ధికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అనేకసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధికి పర్వతమాల పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రధానంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 180 కోట్లతో రోబోవేతో పాటు అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే సిఎం రేవంత్‌రెడ్డితో పాటు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి అందజేశారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వాలు మొదటి అడుగు వేశాయి.ప్రభుత్వాల ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు మంగళవారం ఖిల్లా రామాలయాన్ని పరిశీలించారు. దేశంలోనే ప్రముఖ రోప్‌వే కంపెనీ అయిన సీఆర్‌ఎస్ ప్రతినిధులు ఆలయ పరిసరాలను పూర్తిగా పరిశీలించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. మోనో కేబుల్, బై కేబుల్, జిగ్ జాగ్, ట్రై కేబుల్ ఉంటాయని, ఇక్కడి పరిసరాలకు అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. ఆర్అండ్‌బి డీఈ మోహన్, రోప్‌వే కంపెనీ ప్రతినిధి తన్మయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే చెన్నై షాపింగ్‌కు మాల్‌కు శ్రీముఖి

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణంలో నూతనంగా ప్రారంభం కానున్న చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ యాంకర్, సినీ నటి శ్రీముఖి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శ్రీముఖి రాకతో అభిమానులు, ప్రజల్లో ఉత్సాహం నెలకొంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



